క్లుప్తంగా

అభి'వందన'లు



వందనను అభినందించి సత్కరిస్తున్న డీఎస్పీ అంబికాప్రసాద్, సీఐలు

అమలాపురం టౌన్: మలేషియా దేశంలో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు పతకాలు సాధించిన పిల్లి వందనను అమలాపురం పోలీసు అధికారులు అభినందించారు. డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, పట్టణ, రూరల్ పోలీసు సర్కిళ్ల సీఐలు టి.క్రాంతికుమార్, పి.వీరబాబు అమలాపురం పట్టణం మద్దాలవారిపేటలోని వందన ఇంటికి బుధవారం స్వయంగా వెళ్లి అభినందించి సత్కరించారు. అంతర్జాతీయంగా వందన మరెన్నో పతకాలు సాధించాలని డీఎస్పీ అంబికాప్రసాద్ ఆకాంక్షించారు. వందన కుటుంబ సభ్యులను కూడా పోలీసు అధికారులు అభినందించారు.

టీటీడీలో సేవలకు సీఎం సహకారం మరువలేనిది



కాట్రేనికోనలో టీటీడీ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎస్వీబీసీ చానల్ అడ్వైజర్ అడపా దుర్గ

కాట్రేనికోన: టీటీడీలో మెరుగైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదని టీటీడీ ఎస్వీబీసీ భక్తి చానల్ అడ్వైజర్ అడపా దుర్గ అన్నారు. కాట్రేనికోనలో ఆయన స్వగ్రామంలో వేదపండితులు, పూజారులు, ఆధ్యాత్మిక వేత్తలకు టీటీడీ డైరీలను, క్యాలెండర్లను అందజేశారు. స్థానిక మావుళ్ళ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ ఆనివిళ్ళ సాయిబాబాను ఘనంగా సన్మానించారు.

భీకన్న మృతికి మంత్రి విశ్వరూప్ సంతాపం



భీకన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్, పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు అప్పారి భీకన్న మృతి పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సంతాపం తెలిపారు. 22వ వార్డు శివారులో గల భీకన్న ఇంటికి బుధవారం వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భీకన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ ఆయన వెంట ఉన్నారు.

ఆడుదాం ఆంధ్రపై వలంటీర్లకు అవగాహన



గోడిలంక సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: మండలంలోని గోడిలంక, మొగళ్ళమూరు, తుమ్మలపల్లి, గోడితిప్ప, కొమరగిరిపట్నం గ్రామాల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడలపై వలంటీర్లకు ఎంపీడీఓ కృష్ణమోహన్ బుధవారం అవగాహన కల్పించారు. ఆడుదాం ఆంధ్ర క్రీడలు నిర్వహించే మైదానాలను ఆయన పరిశీలించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేపట్టాలని వలంటీర్లకు ఆదేశాలిచ్చారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ఎన్వీవీ సత్యనారాయణ, దత్తుడు రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ముమ్మిడివరం: తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ముమ్మిడివరం జిల్లా విద్యాశాఖాధికార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అయ్యప్ప భక్తులపై లాఠీచార్జిని ఖండిస్తూ ధర్నా

అమలాపురం రూరల్: శబరిమలలో అయ్యప్ప భక్తులపై లాఠీ చార్జిని ఖండిస్తూ కోనసీమ అయ్యప్ప సేవా సమితి, బజరంగ్ దళ్ నాయకులు బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సన్నిధానం సమీపంలో పలుచోట్ల పోలీసులు లాఠీచార్జి చేసి స్వాములను కొట్టడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. స్వామి దర్శనార్థం వస్తున్న వారికి సరిపడా బస్సులను కేఎస్ఆర్‌టీసీ నడపకపోవడం, కేరళ పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించకపోవడం, దర్శనం క్యూ నిర్వహణను ట్రావెన్‌కూర్ దేవస్థానం పట్టించుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. గంగుమళ్ల శ్రీనివాస్, శిరంగు నాయుడు పాల్గొన్నారు.

దిగుబడి భేష్.. కొనుగోలు శభాష్

- ఆర్‌బీకేల ద్వారా ధాన్యం సేకరణతో లాభం
- అమ్మిన కొద్దిరోజుల్లోనే రైతు ఖాతాల్లోకి నగదు జమ
- తుపాను వేళ అన్నదాతలను గట్టెక్కించిన ప్రభుత్వం



పంట దిగుబడులను మిల్లులకు తరలిస్తున్న రైతులు

ముమ్మిడివరం: ఖరీఫ్ పంట మాసూళ్లు 85శాతం పూర్తవ్వడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఒకవైపు తుపాను వాతావరణం ఉన్నా ధాన్యం సేకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఖరీఫ్ పంట వేసినప్పటి నుంచి రైతులకు ఎటువంటి దిగులు లేకపోయినా, పంట చేతి కందే సమయంలో తుపాను వల్ల ధాన్యం తడిసి పోయింది. దీంతో కొద్దిగా ఇబ్బందులు పడినా, ప్రభుత్వ చర్యలతో తడిసిన ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేయటంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు నిత్యం పర్యవేక్షణ చేసి ఎప్పటి కప్పుడు ధాన్యం మిల్లులకు తరలించడంతో రైతులకు భారం లేకుండా పోయిందని పలువురు కొనియాడుతున్నారు. ఖరీఫ్ దిగుబడులు ఆశాజనకంగా ఉండటం, ప్రభుత్వం ధర పెంచటం, పంట మిగులు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాలు దిగుబడి రావటంతో పెట్టుబడులు పోను కొద్దిపాటి మిగులతో దాళ్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకం అన్నదాతలకు మరింత ఊరటనిస్తోంది.

తగ్గిన పెట్టుబడులు

ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడులు తక్కువగా ఉన్నా..గత ఐదేళ్ల కంటే ఈ ఏడాది మరీ తక్కువైందని రైతులు అంటున్నారు. ఎకరాకు రూ.15 వేలు అయిందని గతంలో ఎకరాకు రూ.20 వేలకు పైబడే పెట్టుబడి అయ్యేదని రైతులు అంటున్నారు. ఈ ఏడాది చేలకు చీడపీడల సమస్య అంతగా లేదని చెబుతున్నారు. వ్యవసాయాధికారులు రైతులకు సూచనలు ఇవ్వడం, వాటిని రైతులు పాటించటం, చివరిలో ఇబ్బంది పెట్టినా వాతవరణం అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయంటున్నారు.

సమయానికి తెరిచిన కొనుగోలు కేంద్రాలు

చేలు కోతలకు సిద్ధమవుతుండగానే గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమయానికి తెరవటం రైతులకు కలిసోచ్చింది. గతంలో సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో రైతులు దళారులను ఆశ్రయించేవారు. ఈ ఏడాది అటువంటి పరిస్థితి లేకుండా ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయటం, ధాన్యం అమ్మిన మూడు రోజుల్లో నగదు తమ ఖాతాల్లో జమ కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మండలానికి 12నుంచి 15 వరకు కేంద్రాలను ఏర్పాటు చేయటంతో రైతులకు ఊరట లభించింది.

ప్రభుత్వ పనితీరు బాగుంది



ధాన్యం కొనుగోలు చాలా బాగుంది. మొదట అనుమానించాం. కానీ అమ్మిన మూడు రోజులకు ధాన్యం సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాలోకి వచ్చింది. ప్రభుత్వం పనితీరు చాలా బాగుంది. – కనకాల రామకృష్ణ, రైతు, చొల్లంగి, తాళ్లరేవు మండలం

దిగుబడులు బాగున్నాయి



గతంలో కంటే ఈ ఖరీఫ్ పంట దిగుబడులు బాగున్నాయి. ఎకరాకు 35 బస్తాలు దిగుబడి వచ్చింది. ఎప్పుడూ ఏదో రూపంలో నష్టపోయేవారం. ఈ ఏడాది పంట చేతి కందే సమయంలో తుపాను వల్ల ధాన్యం తడిసిపోయినా ప్రభుత్వ చర్యల వల్ల మిల్లర్లు కొనుగోలు చేశారు. – ఏఎస్‌వీ సుబ్బారావు, రైతు, అయినాపురం

కోతలు దాదాపు పూర్తి



నియోజకవర్గంలో 85శాతం కోతలు పూర్తయ్యాయి. ముమ్మిడివరం మండలం నుంచి 12వేల మెట్రిక్ టన్నులు సేకరించాల్సి ఉండగా ఇప్పటివరకు 10.083 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. మరో వారం రోజుల్లో ఖరీఫ్ కోతలు పూర్తవుతాయి. – ఎస్.ప్రశాంతకుమార్, ఏఓ, ముమ్మిడివరం

మెప్మా అర్బన్ మార్కెట్‌తో మహిళలకు స్వయం ఉపాధి

మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్ర మణి



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా ఏర్పాటు చేస్తున్న అర్బన్ మార్కెట్‌ల వల్ల డ్వాక్రా మహిళలు ఉత్పత్తి చేస్తున్న వస్తువుల విక్రయాలతో స్వయం ఉపాధి అవకాశాలు మెరుగు పడుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మెప్మా ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆమె బుధవారం ప్రారంభించి ప్రసంగించారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు మెప్మా ప్రోత్సాహంతో ఆర్థికంగా ఎదగడం అభినందనీయమన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ మార్కెట్ వల్ల దాదాపు రూ.2 లక్షల మేర టర్నోవర్ జరుగుతుందని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి పేర్కొన్నారు. లైవ్లీ హుడ్ స్పెషలిస్ట్ కె.మోహన్‌కుమార్, మెప్మా జిల్లా కార్యాలయ ప్రతినిధి సీహెచ్ శ్రీనివాస్, పట్టణ మహిళా సమాఖ్య రిసోర్స్ పర్సన్ పాము శ్యామల, టౌన్ లెవెల్ ప్రెసిడెంట్ కె.సుజాత, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు అర్బన్ మార్కెట్‌ను పర్యవేక్షించారు.

నేటి బాలలు రేపటి శాస్త్రవేత్తలు



ప్రదర్శనలను తిలకిస్తున్న మంత్రి విశ్వరూప్, డీఈవో కమలకుమారి తదితరులు

మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: చిట్టి బుర్రలతో గట్టి ప్రయోగాలు చేస్తున్న నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు కావాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆకాంక్షించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను మంత్రి విశ్వరూప్ బుధవారం ప్రారంభించి ప్రసంగించారు. ఇలాంటి ప్రదర్శనలతోనే విద్యార్థుల్లో విజ్ఞానం వికసిస్తుందని మంత్రి అన్నారు. విద్యార్థుల్లో సైన్స్ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని డీఈవో ఎం.కమలకుమారి అన్నారు. మండలంలోని మొత్తం 18 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు సంబంధించి 52 ప్రదర్శనలు ఏర్పాటయ్యాయి. పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు ఎలా పొందాలో వివరించే ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ సైన్స్ ప్రదర్శనలను వీక్షించారు. అమలాపురం ఎంఈవో-2 గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈవో-2 సరెళ్ల దుర్గాదేవి, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు.

ఇచ్చినమాట నిలబెట్టుకొన్నా : పొన్నాడ

ఐ.పోలవరం: నియోజకవర్గంలో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం అయిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకొన్నానని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. మండలంలో ఐ.పోలవరం, మురమళ్ల గ్రామాల్లో నూతనంగా రక్షిత మంచినీటి ట్యాంక్‌లకు భూమి పూజ నిర్వహించారు. ఐ.పోలవరం సాగిరాజు మెరక వద్ద సర్పంచ్ దంతులూరి రాఘవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రూ.90లక్షల వ్యయంతో 30వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మురమళ్ల జగనన్న కాలనీ, పితానివారిపాలెం వద్ద సర్పంచ్ కాశీ రాజుబాబు అధ్యక్షతన సుమారు రూ.1.70 కోట్లతో నిర్మించే రక్షిత మంచినీటి ట్యాంక్ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఐ.పోలవరంలో మూడవ వాటర్ ట్యాంక్ నిర్మాణం జరుగుతుందని, ఇది ఏప్రిల్ నెలలో ప్రారంభిస్తామన్నారు. మండలంలో ఏ అభివృద్ధి పనులు చేసినా తొలుత దివంగత నేత భూపతిరాజు సుదర్శనబాబును గుర్తు చేసుకొంటానన్నారు. మురమళ్ల జగనన్న కాలనీలో రహదారులు, డ్రయినేజీ తదితర పనులు వేగంగా పూర్తి చేస్తామన్నారు. కాలనీలలో వసతులను స్థానికులను అడిగి తెలుసుకొన్నారు. ఈయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త రాణి మిరియంజ్యోతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, వీరేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పెన్మత్స వాసురాజు, రెడ్ క్రాస్ చైర్మన్ ఢిల్లీ నారాయణ ఉన్నారు.



మురమళ్లలో మంచినీటి ట్యాంక్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

నేడు ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ కేశవన్ రాక

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్‌లలోను ఓటు నమోదు ప్రత్యేక కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో యానాంలో అమలు తీరును పరిశీలించేందుకు ఐఏఎస్ అధికారి, పుదుచ్చేరి ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఆర్. కేశవన్ గురువారం యానాం వస్తున్నారని ఆర్ఏఓ మునిస్వామి ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల సందర్శనతోపాటు, బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల ప్రముఖులతో సమావేశం ఉంటుందన్నారు.

తెగిన చేతి వేలు సర్జరీ ద్వారా అతికింపు

యానాం: రుంగ్టా ఇరిగేషన్ ఫ్యాక్టరీలో యానాంకు చెందిన ఈశ్వరరావు అనే కార్మికుడు పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కుడిచేయి చూపుడు వేలు తెగిపడింది. సూర్యపోలీ క్లినిక్ వైద్యుడు నక్కా విజయకుమార్ శస్త్ర చికిత్సచేసి వేలు అతికించారు. బాధితుడ్ని త్వరగా తీసుకురావడం ద్వారా చికిత్స చేసి అతికించగలిగామని వైద్యుడు తెలిపారు.



ధాన్యం రాశుల పరిశీలన

ఉప్పలగుప్తం: ఖరీఫ్ వరి సాగులో రైతులు ఒబ్బిడి చేసుకుంటున్న ధాన్యం రాశులను మండల వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు బుధవారం విలస విల్లిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంట చేతికొచ్చేసరికి అకస్మాత్తుగా మిచాంగ్ తుపాను సంభవించటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన వివరించారు. పంట నష్ట పోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం తరఫున పరిహారం అందేలా తమ సిబ్బందితో పాటు కృషి చేస్తామన్నారు. మండల వ్యాప్తంగా 5,134 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయగా 1,543 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఆస్తి నష్టం రూ.1.06 కోట్లుగా గుర్తించామన్నారు. రబీ సాగు నిమిత్తం ఏర్పాటు చేసుకున్న 92.7 ఎకరాల్లో సుమారు 1,800 ఎకరాలకు వేసిన నారుమడులు నీట మునిగాయని, నారుమడి నష్టపోయిన రైతులను గుర్తించి 80 శాతం రాయితీతో ఎంటీయూ 1121 రకం విత్తనాలను అందిస్తున్నామని ఆయన వివరించారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా హరిబాబు



నియామక పత్రాన్ని అందుకుంటున్న హరిబాబు

ఉప్పలగుప్తం: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా చల్లపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పోలిశెట్టి హరిబాబు నియమితులయ్యారు. అమలాపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాసరావు చేతుల మీదుగా బుధవారం హరిబాబు నియామక పత్రాన్ని అందుకున్నారు.

ఉపాధ్యక్షుడిగా ఉదయ భాస్కరవర్మ

ముమ్మిడివరం: డీసీసీ ఉపాధ్యక్షుడిగా పి.ఉదయ భాస్కరవర్మ నియమితులయ్యారు.

ఘనంగా వన సమారాధన

అమలాపురం రూరల్: జనకళ్యాణ్ సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిటీ వన సమారాధన ఈదరపల్లి టీ ఐలో ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్ట్ మేనేజర్ జి శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అమలాపురం ఏరియా హాస్పిటల్ కౌన్సిలర్ జి.కవిత, ఐసీడీసీ కౌన్సిలర్ జి చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆరోగ్యకరమైన లైంగిక ప్రవర్తన ఏ విధంగా పెంపొందించుకోవాలి హెచ్ఐవీ/ఎయిడ్స్, సుఖ వ్యాధులపై కమ్యూనిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. టీఏ లక్ష్మి, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పేదల అభ్యున్నతి

తాళ్లరేవు: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. బుధవారం పి.మల్లవరం పంచాయతీ సచివాలయం-2 పరిధిలోని పత్తిగొందిలో గ్రామ ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శివన్నారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదల కష్టాలు తెలిసిన మనసున్న ముఖ్యమంత్రి.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమంతోపాటు అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. ఆయా అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా చేయాలని కోరారు. గడచిన నాలుగున్నరేళ్లలో సచివాలయం-2లో వివిధ పథకాల ద్వారా సుమారు రూ.20 కోట్లకు పైగా లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. అనంతరం పథకాల లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌ను, పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. పార్టీ మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యుడు దున్నా రాంబాబు, పంచాయతీ కార్యదర్శి సూరంపూడి వెంకటరమణ, వార్డు సభ్యులు దున్నా శ్రీనివాస కుటుంబరావు, సబ్బతి రామకృష్ణ, మట్టపర్తి తులసి పాల్గొన్నారు.



పత్తిగొందిలో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌ను ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ

సమన్యాయ పాలన జగన్‌తోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: అర్హులైన వారందరికీ సంక్షేమాలు అందించి సమన్యాయ పాలన జరపటం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం అని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. మండలంలోని తూర్పులంక గ్రామంలో సర్పంచ్ కడలి గంగాచలం ఆధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయ పరిధిలో వివిధ సంక్షేమాల ద్వారా చేకూరిన లబ్ధి పట్టికను పార్టీ నాయకులతో కలసి ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జీవీకే చైర్మన్ తిక్కా ప్రసాద్, సర్పంచ్‌లు ఎన్వీవీ సత్యనారాయణ, బర్రే సీతారత్నం పాల్గొన్నారు.

శివగంగ దుర్గకు ఎమ్మెల్యే పొన్నాడ అభినందనలు



శివగంగ దుర్గను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: ఇటీవల థాయిలాండ్‌లో జరిగిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్, అండ్ గేమ్స్‌లో అథ్లెటిక్స్ విభాగంలో డిస్కస్ త్రో, జావెలెన్ త్రోలలో బంగారు పతకాలు సాధించిన గాలిదేవర శివగంగ దుర్గను టీటీడీ పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అభినందించారు. శివగంగ దుర్గ ఎమ్మెల్యే పొన్నాడను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే పొన్నాడ దుర్గను అభినందించారు. ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శులు సుధారాణి, సూరంపూడి వెంకట రమణ ఉన్నారు.

శాంతియుత సమాజానికి క్రీస్తు బోధనలు దోహదం

యానాం: శాంతియుత సమాజానికి క్రీస్తుబోధనలు దోహదపడతాయని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బెజవాడా గార్డెన్స్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకలలో ఆయన మాట్లాడారు. సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రెవ.బిహెచ్‌విమూర్తిరాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మించి నేటికి రెండువేల ఏళ్లు దాటినా కరుణామయుడుగాను, దయామయుడుగాను ఆరాధనలు అందుకుంటున్నారని అన్నారు.

